ప్రభాత

# ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 113 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 2 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## కొత్త శిఖరాలకు

# తెలంగాణ ఆర్థికాభివృద్ధి

### తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిక.. సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి






**హైదరాబాద్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం



### ధరణి అక్రమాలపై ఉక్కుపాదం.. అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ
### నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదు
### భూముల ధరల సవరణతో ఆదాయం 20శాతం వరకు పెరుగుదల
### త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం: మంత్రి పొంగులేటి
### కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం

**హైదరాబాద్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణి నుంచి భూభారతి వరకు లావాదేవీలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. పేదల భూములను కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదన్నారు. మరోవైపు భూముల ధరల సవరణతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం వరకు పెరిగిందని పొంగులేటి తెలిపారు. సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ..మిగతా 2లో


## తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో

# కమిటీ కీలక భేటీ

### అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్
### అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలకు చెక్ పెట్టడమే ప్రభుత్వ లక్ష్యమన్న పొన్నం ప్రభాకర్
### వారం రోజుల్లో మరోసారి భేటీ కానున్న కమిటీ
### అన్ని పార్టీల సలహాలు తీసుకుంటామన్న మంత్రి

2





## గోదావరి జలాల్లో

# తెలంగాణకు నష్టం

### నీళ్లు మళ్లించే ఎపి కుట్రలు వేగమయ్యాయి
### టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపణ

**హైదరాబాద్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తోందని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను అడ్డుకునేలా ఎత్తుగడలు వేస్తోందని విమర్శించారు. తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ..మిగతా 2లో




# హైడ్రాపై తగ్గేదేలే..!

### హైదరాబాద్‌కి సరికొత్త అందాలు జోడిస్తున్నారు: సీఎం రేవంత్ రెడ్డి సంచలన పోస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

హైడ్రాపై విమర్శలు, హైకోర్టు తీర్పుతో రాజకీయ దుమారం కొనసాగుతున్న వేళ సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి హైడ్రాకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఉప్పల్ నల్లచెరువు పునరుజ్జీవ పనులను ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టు చేసిన ఆయన.. చెరువుల పరిరక్షణ అంటే భావితరాల భవిష్యత్తును కాపాడటమేనని పేర్కొన్నారు. హైడ్రా పనితీరును కొనియాడుతూ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఒకవైపు విపక్షాల విమర్శల వర్షం.. మరోవైపు హైకోర్టు తీర్పుతో కలకలం.. అయినా, తగ్గేదే లేదంటూ కాంగ్రెస్ కౌంటర్స్.. కొన్నాళ్లుగా హైడ్రా అండ్ కమిషనర్ రంగనాథ్ చుట్టూ నడుస్తోన్న హైవోల్టేజ్ వార్ ఇది.. అయితే.. హైడ్రా టార్గెట్‌గా విపక్షాలు ఎన్ని విమర్శలుచేసినా.. రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఆదేశించినా.. తగ్గేదే లేదన్న కామెంట్స్.. కాంగ్రెస్ నుంచి, సీఎం రేవంత్ రెడ్డి నుంచి వినిపించాయ్. ఆరునూరైనా.. నూరుఆరైనా.. హైడ్రా ఆగనే ఆగదని తేల్చిచెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఒక రేంజ్ ఎలివేషన్ ఇచ్చారు. ఉప్పల్ నల్లచెరువు సాక్షిగా హైడ్రాపై ప్రశంసల వర్షం కురిపించారు సీఎం. చెరువులు పునరుద్ధరించడంలో హైడ్రా కృషిని అభినందించారు. ఉప్పల్ నల్లచెరువు పునరుజ్జీవానికి హైడ్రా అధికారులు, సిబ్బంది అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. హైదరాబాద్ జఖ=జు పరిధిని క్యూర్ చేసుకుంటూ, మన చెరువులకు జీవం పోస్తూ, భావి తరాలకు జీవంతో నిండిన భవిష్యత్తును హైడ్రా అందిస్తోందన్నారు రేవంత్‌రెడ్డి. హైదరాబాద్‌లో చెరువుల పునరుజ్జీవంపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన రేవంత్‌రెడ్డి.. ఉప్పల్ నల్లచెరువును ప్రత్యేకంగా ప్రస్తావించారు. నాడు-నేడు పేరుతో ఒక వీడియోను పోస్ట్‌చేశారు. ఉప్పల్ నల్లచెరువు.. గతంలో ఎలా ఉండేదో.. హైడ్రా ఆపరేషన్ ..మిగతా 2లో

### పెట్టుబడులు లక్ష్యంగా

# సిఎం విదేశీ టూర్

2

### ఆగస్ట్ 20 నుంచి పది రోజుల పాటు వివిధ దేశాల్లో పర్యటన



## వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా

# జెన్ జీ ఓటర్లు

### సోషల్ మీడియా వల్లే జవాబుదారీతనం పెరిగిందన్న కేటీఆర్
### నేటి యువతరం రీల్స్ రూపంలో వార్తలు చూస్తోందని వ్యాఖ్య

**హైదరాబాద్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# పెట్టుబుడులు లక్ష్యంగా సిఎం విదేశీ టూర్

**హైదరాబాద్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**



తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగష్టు 20 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 20 రోజులపాటు వివిధ దేశాల్లో సీఎం పర్యటించనున్నారు. అమెరికా, యూకే సహా మరికొన్ని కీలక దేశాలకు ఆయన వెళ్లనున్నట్టు సమాచారం. అయితే ఆయా దేశాల్లోని కంపెనీల ప్రతినిధులు, అపాయింట్‌మెంట్‌ల నేపథ్యంలో సీఎం టూర్ షెడ్యూల్ ఆగష్టు 20-23 తేదీల మధ్య ఉండవచ్చని కూడా అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. ఐటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం టూర్ ఉండొచ్చని సమాచారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కంపెనీలతో, లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపే అవకాశం ఉంది. అలాగే గతంలో విదేశీ పర్యటనల సంద ర్భంగా పలు అంతర్జాతీయ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో.. ఆయా కంపెనీల ప్రతినిధులతోనూ రేవంత్ భేటీ అయ్యే అవకాశాలున్నాయి. చట్టసభల్లోకి ప్రవేశించే వయసును 21కి తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తీర్మానం చేసేందుకు ఆగష్టు 17-18 తేదీల్లో ఒక రోజు ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక వర్షాకాల సమావేశాలను సెప్టెంబరు మూడో వారంలో వారంపాటు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఆగస్టులో సీఎం విదేశీ పర్యటనకు ప్రాథమిక షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో.. సెప్టెంబరు రెండో వారం వరకు ఆయన తిరిగి రాష్ట్రానికి వస్తారని, మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఉంటాయనే చర్చ సచివాలయంలో జరుగుతోంది.

## గోదావరి జలాల్లో తెలంగాణకు నష్టం

**మొదటి పేజీ తరువాయి...**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో గోదావరి జలాలను మళ్లించే కుట్రలు వేగవంతమయ్యాయని ఆరోపించారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను ప్రశ్నిస్తూ ఫిర్యాదులు చేయడం ద్వారా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) కూడా ఆంధ్రప్రదేశ్ వైఖరికి అనుగుణంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోదావరి నదిలో తెలంగాణకు 964 టీఎంసీల జలాలపై హక్కు ఉందని, ట్రిబ్యునల్ రక్షణ కలిగిన కేటాయింపులు చెల్లవని పేర్కొంటూ తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోరడం తెలంగాణ హక్కులను కాలరాయడమేనని కవిత అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వకుండా, తెలంగాణ ప్రజల హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## సంతాన వేణుగోపాలస్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా కే. ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**



గద్వాల పట్టణం భీంనగర్‌లోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా కే. ప్రసాద్, శనివారంబాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ ఆంజనేయ స్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం పదోన్నతి పొంది, గద్వాలకు వచ్చారు. బాధ్యతల స్వీకరణకు ముందు కే. ప్రసాద్ ఆలయాన్ని దర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు శేషవస్త్రం, పూలదండలతో వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనుంపల్లి జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, బీచుపల్లి ఆలయ జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మయ్య, తదితరులు నూతన ఈ.ఓకు పుష్పగుచ్ఛాలు అందజేసి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.







## మల్దకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ ప్రారంభం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో చదివితే భవిష్యత్తులో అద్భుత స్థాయికి ఎదుగుతారని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగద రావు అన్నారు. శనివారం మల్దకల్ మండల కేంద్రంలోని పీయం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌ను అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు తో కలిసి గద్వాల ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఎమ్మెల్యేగా ఎదిగానని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే సైకిళ్లను ఉచితంగా అందజేస్తామని ప్రకటించారు. గదుల ప్లాస్టరింగ్ సహాయానికి పీఏసీఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి ముందుకు వచ్చారు. మెడికల్, నర్సింగ్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో ఎంబీఏ కాలేజీ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రెండేళ్లలో రెట్టింపు అయిన అగ్రి బీఎస్సీ సీట్లు

**ఈ ఏడాది సుమారు 2,000 సీట్ల భర్తీ..**

**భారీ గా తగ్గిన ప్రత్యేక కోటా రుసుములు :**

**ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య**

**బుద్వేల్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం) :**

2026-27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విద్యాలయం పరిధి లోని 13 కళాశాలల్లో బీ ఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్,ఇతర డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకి ఆన్ లైన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోందని ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. తెలంగాణా ఎప్ సెట్ -2026 లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆగస్టు 11 వ తేదీ వరకు దరఖాస్తు రుసుము చెల్లించి ఆగస్టు 12 వ తేదీ లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు దాఖలు చేయవచ్చని ఆయన సూచించారు. తాను ఉప కులపతి గా బాధ్యతలు చేపట్టిన ఈ రెండేళ్ళ లో కొత్త కళాశాలల ఏర్పాటు,సీట్ల పెంపు,రుసుముల తగ్గింపు ల పై ప్రత్యేక దృష్టి సారించినట్లు జానయ్య తెలిపారు. 2023-24 లో బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ సీట్లు 1012 ఉండగా 2026-27 విద్యాసంవత్సరానికి సుమారు 2,000 అయ్యాయని పేర్కొన్నారు.ప్రతి ఉమ్మడి జిల్లాకి ఒక వ్యవసాయ కళాశాల ఉండాలన్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిపాదన కి అనుగుణం గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నిరుడు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని కొడంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లా లోని హుజూర్ నగర్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లోని డిచ్ పల్లి లలో కొత్త కళాశాలల ఏర్పాటుకి అనుమతిచ్చారని తెలిపారు. నిరుడు ఈ కొత్త కళాశాలలలో ఒక్కో దాని లో 30 సీట్లు భర్తీ చేశామన్నారు. ఈ ఏడాది నుంచి ఈ కళాశాల లలో ఒక్కొక్కదాని లో 120 సీట్లు అదనం గా భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.



అదే విధం గా ప్రత్యేక కోటా సీట్ల రుసుములని గణనీయం గా తగ్గించామని జానయ్య తెలిపారు. 2023-24 లో ప్రత్యేక కోటా సీట్ల ఫీజు ఏక కాలం లో పది లక్షల రూపాయల చెల్లింపు తో పాటు ఒక్కో ఏడాదికి ఒక లక్ష రూపాయలు చెల్లించాల్సి ఉండేదని తెలిపారు. ఈ రుసుములని గణనీయం గా తగ్గించి 2026-27 కి ఒక్కో సెమిస్టర్ కి రుసుము ని కేవలం రూ. 75,000 గా నిర్ణయించామన్నారు. అదే విధం గా ఎన్.ఆర్.ఐ కోటా లో 2023-24 లో ప్రవేశ సమయం లో అభ్యర్థులు ఒకే సారి 30 లక్షల రూపాయలు చెల్లించి ఒక్కో సెమిస్టర్ కి లక్ష రూపాయల ఫీజు చెల్లించాల్సి వచ్చేదన్నారు .దాన్ని బాగా తగ్గించి 2026-27 కి ఒక్కో సెమిస్టర్ కి రూ. 1,35,000 కి పరిమితం చేసామని జానయ్య వివరించారు.

**19 వ ర్యాంక్ తో పాటు అన్ని గుర్తింపులు ఉన్న అగ్రి వర్సిటీ :**

దేశం లోని సుమారు 80 వ్యవసాయ ,మరియు వ్యవసాయ అనుబంధ విశ్వ విద్యాలయాల్లో 2026లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 19 వ ర్యాంక్ లో నిలిచిందని జానయ్య తెలిపారు. అంతే కాకుండా 1964 లో దేశం లోనే రెండవ వ్యవసాయ విశ్వ విద్యాలయం గా స్థాపితం అయిన ఈ విశ్వ విద్యాలయం నాటి నుంచి నేటి వరకూ ఐకార్ మరియు యూ జీ సి లు నిర్ధారించిన నాణ్యత,ప్రమాణాలు కలిగి ఉందన్నారు. ఈ విశ్వ విద్యాలయానికి ,దీని పరిధి లోని అన్ని కళాశాల లకి ,కోర్సులన్నిటి కి ఐకార్ అక్రిడేషన్ ఉందన్నారు. ఐకార్ నిబంధనల ప్రకారం కొత్త గా ఏర్పాటైన కళాశాలల కి తొలి ఐదు సంవత్సరాలు అక్రిడేషన్ ప్రక్రియ నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. కాబట్టి తొలి ఐదేళ్ళు ఐకార్ అక్రిడేషన్ ఉన్నట్లు గానే పరిగణించాల్సి ఉంటుందని వివరించారు. 2027 మార్చి వరకూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, దాని పరిధి లోని అన్ని కళాశాలలు,కోర్సులకి ఐకార్ అక్రిడేషన్ యూజీసీ కి సంబంధించిన విద్యా ప్రమాణాలు ఉన్నాయని పేర్కొన్నారు.

**కృత్రిమ మేధస్సు,ఆధునిక ప్రయోగ శాల ల తో కొత్త హంగులు :**

గత రెండేళ్ళ గా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధి లోని అన్ని కళాశాల లు,పరిశోధనా స్థానాల్లో కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన ప్రయోగ శాలలు ,మౌలిక వసతులు ఏర్పాటు చేసి సమకాలీన వ్యవసాయ రంగానికి కావాల్సిన ఆధునిక సాంకేతిక అంశాల్ని బీ ఎస్సీ(అగ్రికల్చర్) సిలబస్ లో చేర్చామని తెలిపారు. తద్వారా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులైన వారికి ఆకర్షణీయమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం గా చర్యలు తీసుకుంటున్నామని అల్దాస్ జానయ్య వివరించారు.



## పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం

**మొదటి పేజీ తరువాయి...**

కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్దిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ౹÷నైల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ. 13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ. 15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో కమిటీ కీలక భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

అసెంబ్లీలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహకాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ ఛైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈరోజు కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవ లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు హాజరయ్యారు. సమావేశంలో విద్వేష ప్రసంగాలు, క్రైమ్ బిల్లు ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీ పరిధిలో సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకుంటూనే, ఇతరులను వ్యక్తిగతంగా దూషించడం లేదా విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా ఉండేలా బలమైన చట్టం తీసుకురావడమే తమ కమిటీ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఈ క్రైమ్ అండ్ హేట్ స్పీచ్ బిల్లుపై పూర్తి నివేదికను అసెంబ్లీకి సమర్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో కమిటీ మరోసారి సమావేశం కానుంది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు సమాజంలోని ప్రముఖులు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని నివేదికను తుదిరూపు ఇస్తామన్నారు. ఈ చట్టం ఎవరి హక్కులనూ కాలరాయదని, కేవలం సభ గౌరవాన్ని, వ్యక్తుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకేనని భరోసా ఇచ్చారు.

## హైడ్రాపై తగ్గేదేలే..!

**మొదటి పేజీ తరువాయి...**



తర్వాత ఇప్పుడెలా ఉందో తెలియజేస్తూ వీడియో పెట్టారు. రేవంత్ పెట్టిన ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో మురుగునీటితో కళావిహీనంగా కనిపించిన నల్లచెరువును 20 కోట్ల రూపాయల వ్యయంతో సుందరంగా తీర్చిదిద్దింది హైడ్రా. చెరువు శిఖంలో ఆక్రమణలను తొలగించి.. పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేసింది. వరదనీరు సులభంగా చెరువులోకి చేరేలా రెండు ఇన్‌లెట్లు.. మురుగునీరు కలవకుండా ప్రత్యేక డైవర్షన్ కాలువ నిర్మాణాలు చేపట్టారు. చెరువు పూర్తిగా నిండి నీటిమట్టం ప్రమాదకరస్థాయికి చేరితే.. ఔట్‌ఫ్లో కోసం ఔట్‌లెట్లు నిర్మించారు. చెరువు ఔట్‌ఫ్లో ఈజీగా మూసీలో కలిసేలా ఏర్పాట్లుచేయడంతో ఉప్పల్ ప్రాంతంలో వరద ముప్పు కూడా గణనీయంగా తగ్గించారు. హైడ్రా ఆపరేషన్ తర్వాత కొత్తరూపు సంతరించుకున్న ఉప్పల్ నల్లచెరువు.. ఇటీవల కురిసిన వర్షాలతో నిండుకుండను తలపిస్తోంది. దాంతో, చెరువుల పునరుజ్జీవం, హైడ్రాను అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు సీఎం రేవంత్.

చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదు.. భావి తరాల భవిష్యత్తును భద్రపరచడమన్నారు సీఎం రేవంత్. చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మార్చుకుంటున్న హైదరాబాద్‌ను చూస్తుంటే తనకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఇక ముందు కూడా ప్రతి చెరువును కాపాడుతూ... ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామన్నారు సీఎం రేవంత్. అయితే, హైకోర్టు తీర్పుతో విమర్శల దాడి పెరిగినవేళ.. హైడ్రాను ఆకాశానికెత్తుతూ రేవంత్‌రెడ్డి పోస్ట్ పెట్టడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.

# సమాచార హక్కు చట్టం కార్యదర్శిగా భారతి లక్‌పతి నాయక్ సేవలు అభినందనీయం

## తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమీషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఆగస్టు 1(ప్రభాత ఉదయం)**




రాష్ట్ర సమాచార హక్కు చట్టం కార్యదర్శిగా పాలన పరమైన చర్యలను చేపట్టడంలో భారతిలక్ పతి నాయక్ ఐఏఎస్ చేసి సేవలు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమీషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి కొనియాడారు. సాధారణ కుటుంబానికి చెందిన మహిళ అయినా ఆత్మవిశ్వాసంతో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించి అంచలంచేలుగా ఎదుగుతూ ఐఏఎస్ హోదాలో, ప్రభుత్వ కార్యదర్శిగా పదవీ విరమణ చేయడం ఆమె పట్టుదలకు నిదర్శనమని గుర్తు చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర సమాచారా హక్కు చట్టం కార్యదర్శిగా పనిచేసిన భారతిలక్ పతి నాయక్ ఐఏఎస్ ఉద్యోగ పదవీవిరమణ ఆత్మీయ విడ్కోలు సభ సమాచార హక్కు భవన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కమీషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి ఆమెను ఘనంగా సన్మానించి, పదవీవిరమణ సత్కర పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలం పాటు ఆర్టిఐ ప్రభుత్వ కార్యదర్శిగా పని చేసిన భారతి లక్ పతి నాయక్ కార్యాలయంలోని పరిపాలనను గాడిలో పెట్టడానికి కృషి చేశారన్నారు. కార్యాలయంలో ఖాళీగా ఉన్న స్థానాలలో ఉ ద్యోగులను భర్తీ చేయడంతో పాటు 20 వేల పెండిగ్ కేసులను కమీషనర్‌లు పరిష్కారించడానికి తనవంతు సహకారం అందించారని చెప్పారు. కష్టపడి ఐఏఎస్ స్థాయికి చేరుకోవడంతో పాటు వివిధ జిల్లాలలో తోపాటు సచివాలయంలోని పలు విభాగాలలో ఆమె సేవలందించారని, దాంతో కార్యాలయ పరిపాలనలో మంచి పట్టున్న అధికారిణిగా రాణించారని చెప్పారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలతో పాటు 2014 నుంచి 2023 వరకు వార్షిక నివేధికలు సిద్దం చేయడంలో ఆమె ఎంతో సహకారం అందించారన్నారు. తొలిసారి శాసన సభకు డిజిటల్ రూపంలో వార్షిక నివేధికలను అందించడంలో కార్యదర్శిగా ఆమె కృషి ఉందని పేర్కొన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన భారతి లక్ పతి నాయక్ మాట్లాడుతూ ఎపిపిఎస్‌సి ద్వారా ఎంపికైన తాను ఉమ్మడి రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో మొట్ట మొదటి మహిళా డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించినట్లు చెప్పారు. . పూర్వపు ఖమ్మం జిల్లా, ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వచ ప్రాంతానికి చెందిన తాను 2025 జూన్ లో తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కార్యదర్శిగా బాధ్యతల స్వీకరించినట్లు తెలిపారు. అంతకు ముందు ప్రభుత్వ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో స్పెషన్ సెక్రెటరీగా, ఆరోగ్య శాఖ జాయింట్ కమీషనర్‌గా, జిఏడి డిప్యూటీ సెక్రెటరీగా, మహబూబ్ నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా, ప్రభుత్వం చిన్నమొత్తాల పొదుపు శాఖ అసిస్టెంట్ కమీషనర్‌గా పని చేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా, ఆదిలాబాద్ జిల్లా రెవిన్యూ ఆఫీసర్‌గా, మొట్టమొదటి రంగారెడ్డి జిల్లా మహిళా డిప్యూటీ కలెక్టర్‌గా పని చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఆర్టిఐ కమీషనర్లు దేశాల భూపాల్, మోసిన ఫర్వీన్ తోపాటు వివిధ సెలక్షన్‌ల అధికారులు, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.




రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని కలిసిన రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ బి కృష్ణా రెడ్డి

## ఆర్టీసీ ప్రహరిని ఆనుకుని ఉన్న ఆక్రమణలను తొలగించండి

**బుద్వేల్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

బన్సీలాల్ నగర్ చౌరస్తా నుంచి బుద్వేల్ శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయం, అక్కడి నుంచి కిస్టమ్మ గుట్ట వరకు రోడ్డు ను వెడల్పు చేసి, రోడ్డు పక్కన అక్రమంగా వేసిన డబ్బాలను, దుకాణాలను తొలగించాలని రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజరు బి క్రిష్ణారెడ్డి కోరారు. రోడ్డు పక్కన వెలసిన ఆక్రమణ లను తొలగించినట్లుయితే ఆ రూట్ లో ఆర్టీసీ బస్సులు నడుపుతామన్నారు.. ఆర్టీసీ బస్సు డిపో ప్రహరీగోడ ను ఆనుకుని కూడా చాలామంది ఆక్రమణలను చేపట్టారని, వాటిని కూడా తెలగించాలన్నారు. దానికి జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారని బి క్రిష్ణారెడ్డి తెలిపారు.

## గుండెపోటుతో నర్సింహ్మా ఇశ్రాయేలు మృతి

**బుద్వేల్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**



అన్ని వర్గాల పేద ప్రజల పోరాట సమితి కార్యదర్శి, బుద్వేల్ కు చెందిన నర్సింహ్మా ఇశ్రాయేలు (45) గుండెపోటు తో శనివారం తెల్లవారు జామున మృతి చెందారు. దళిత సంఘాలు, పేదల సంఘాలలో చురుకుగా పనిచేసే నర్సింహ్మా ఇశ్రాయేలు బుద్వేల్ లో టైలర్ నర్సిం హ్మా గా చిరపరిచితుడు. ఆయనకు భార్య లక్ష్మీ, కుమార్తె సుప్రజ, కుమారుడు రిషి లు ఉన్నారు. శుక్రవారం రాత్రి వరకు ఆరోగ్యంగా ఉన్న ఆయనకు శనివారం తెల్లవారు జామున గుండె నొప్పి రావడం తో స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు పెద్దాసుపత్రికి తీసుకువెళ్లండని సూచన చేయడంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. నర్సింహ్మా ఇశ్రాయేలు సమాధి కార్యక్రమాలు ఆదివారం మద్యాహ్నం బుద్వేల్ లో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



ఉప్పర్ పల్లి లో రోడ్ల గురించి వివరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి

## ఉప్పర్‌పల్లిలో రోడ్లను బాగు చేయండి : సామ ఇంద్రపాల్ రెడ్డి

**బుద్వేల్, జూలై 1 (ప్రభాత ఉదయం)**

బోనాల పండుగ, వినాయక చవితి సందర్భంగా ఉప్పర్ పల్లి లోని అన్ని రోడ్లను బాగు చేయాలని కాంగ్రెస్ పార్టీ హైదరశీడ డివిజన్ అధ్యక్షులు సామ ఇంద్ర పాల్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ ఆదేశాలతో శనివారం ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉప్పర్ పల్లి లో పర్యటించి పాడైన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంద్రపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సూచన మేరకు అధికారులకు అన్ని బస్తీలలో ఉన్న రోడ్లను చూపించడం జరిగిం దన్నారు. కొత్తగా వెలసిన కాలనీలలో కూడా రోడ్ల సౌకర్యం లేదన్నారు. అక్కడ కూడా రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధి దీపాలు, పారిశుశ్య సమస్యలను పరిష్కరించాలన్నారు.




మహిళల కోసం ఉన్న చట్టాలపై అవగాహన కల్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశీ సదాలక్ష్మి

## మహిళలకు ఉన్న చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలి

### మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశీ సదాలక్ష్మీ

**బుద్వేల్, జూలై 1 (ప్రభాత ఉదయం) :**

మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటి అమలు లో పోలీస్ యంత్రాంగం తో పాటు, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ దవలప్మెంట్ స్కీమ్ (ఐసీడీఎస్) లో పనిచేస్తున్న సిబ్బంది, సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఎ సదాలక్ష్మి అన్నారు. మహిళ ల కోసం ఉన్న చట్టాలపై పాఠశాల విద్యార్థినీలకు శేరిలింగంపల్లి ప్రాజెక్టు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం కాటేదాన్ లోని గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎ సదాలక్ష్మీ మాట్లాడుతూ, చట్టాలను ఖచ్చితంగా అమలు చేసినప్పుడు మహిళలు, చిన్నారులపైన దాడులు చేయడానికి ప్రతి ఒక్కరు భయపడుతారన్నారు. బాల్య వివాహాలు జరుగకుండ సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే వెంటనే పోలీసులకు గానీ, ఐసీడీఎస్ అధికారులకు గానీ తెలియజేయాలన్నారు. బాలికలపై, మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే ఫోక్సో యాక్ట్ 2012 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. బాల్య వివాహాలు జరిపిన వారిపై ప్రాహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారెజెస్ యాక్ట్ 2006 ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయ కార్యదర్శి పద్మజ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్, రాజేంద్రనగర్ ఎంఈఓ శంకర్ రాథోడ్, శేరిలింగంపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ కవిత తో పాటు వివిధ రంగాల ప్రతినిధులు డాక్టర్ శ్రవణ్, ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశీ సదాలక్ష్మి ని సన్మానిస్తున్న ఐ సీ డీ ఎస్ సిబ్బంది




మాదక ద్రవ్యాలు వాడవద్దు అంటు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య

## విద్యార్థులు, యువత మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య

**బుద్వేల్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

మాధక ద్రవ్యాల నిర్మూలన కు ప్రతి ఒక్కరు సహకరించాలని అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య తెలిపారు. శనివారం అత్తాపూర్ శ్రీ అభిధ పాఠశాలలో విద్యార్థులకు మాధక ద్రవ్యాల వాడకం వల్ల జరిగే అనర్థాలను వివరిస్తు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చదువు కునే సమయంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల కూడా య వత అప్రమత్తంగా ఉ ండాలన్నారు. లోన్ యాప్ల జోలికి వెళ్లకూడదన్నారు. ఎటివంటి పరిస్థితులలోను ఆన్లైన్ లో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శ్రీ అభిధ ఛైర్మన్ శ్రీనివాస్ రావు అలమంద శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



రౌడీ షీటర్‌లకు కౌన్సిలింగ్ ఇస్తున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య

## అత్తాపూర్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన ఇన్స్‌పెక్టర్‌ఎ సీతయ్య

**బుద్వేల్, జూలై 1 (ప్రభాత ఉదయం)**

రౌడీ షీటర్లు సత్రృవర్ధన తో జీవించాలని అత్తాపూర్ ఇన్ స్పెక్టర్ ఏ సీతయ్య అన్నారు. శనివారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. చెడు పనులకు, దౌర్జన్యాలకు దూరంగా ఉండాలన్నారు. రౌడీషీటర్లు బస్తీలలో ఏమైన గొడవ కు పాల్పడినారని తెలిస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు మంచి అలవాట్లతో జీవించాలన్నారు. రాబోయే బోనాల ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పర్వదినాలను దృ ష్టిలో ఉంచుకుని ఎలాంటి గొడవలకు పాల్పడవద్దన్నారు. రౌడీషీటర్ల ఆగడాలు తమ దృష్టికి వస్తే కఠినం గా వ్యవహరించడం జరుగుతుందన్నారు.

# బోనాల ఉత్సవాల నిర్వాహణకు 80 దేవాలయాలకు రూ. 27లక్షల చెక్కుల పంపిణీ



బోనాల చెక్కులను భక్తులకు అందచేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు హర్కాల వేణు గోపాల్



చెక్కులు పంపిణీ చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

**బుద్వేల్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

బోనాల పండుగ ను భక్తి శ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణం లో నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు హర్కాల వేణుగోపాల్ లు అన్నారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోని అమ్మవారి దేవాలయాల కమిటీ ప్రతినిధులకు శివరాంపల్లి రాందేవ్ బాబా దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 80 దేవాలయాలకు రూ.27 లక్షల చెక్కులను అందజేశారు. ఈ నిధులు ఉత్సవాల నిర్వహణ కు ఉ పయోగించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి నాయకత్వంలో బోనాల పండుగకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ 'కమిటీ డైరెక్టర్ బండారి శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి, రగడంపల్లి శ్రావణ్, సరికొండ వెంకటేశ్, కాశీగారి యాదగిరి, టి ప్రేం గౌడ్, ఎన్ ధనుంజయ, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లల హక్కుల పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం

**పాఠశాలల్లో విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే వెంటనే స్పందించాలి**

**జిల్లాలో బాల్య వివాహాలు, బాల కార్మికత్వాన్ని పూర్తిగా నిర్మూలించాలి**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**




పిల్లల హక్కుల పరిరక్షణ,భద్రత కల్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ కళ్యాణ చక్రవర్తి అన్నారు.జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నాల్స "పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం--2024" పై చైల్డ్ ప్రొటెక్షన్ అధికారుల కోసం శనివారం గద్వాల పట్టణంలోని అనంత ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఒక రోజు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నాల్సా --పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం--2024 ద్వారా ప్రతి చిన్నారికి ఉచిత న్యాయ సహాయం,పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవలు అందించడం అన్నారు.అలాగే వారికి చట్టాలపై అవగాహన, అవసరమైన కౌన్సెలింగ్, రక్షణ,పునరావాసం అందించడమే, లక్ష్యమన్నారు.పిల్లల గోప్యత, గౌరవం,భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ,సంబంధిత శాఖల సమన్వయంతో వారి శ్రేయస్సు కోసం ఈ పథకం పనిచేస్తుందని వివరించారు.పోక్సో (గూజూా) చట్టం--2012లో మొత్తం 46 సెక్షన్లు ఉన్నాయని,ఈ చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ పిల్లలుగా పరిగణించబడతారని తెలిపారు. పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించడం,బాధితులకు న్యాయ పరిరక్షణ కల్పించడం, నేరస్థులకు కఠిన శిక్షలు విధించడమే పోక్సో చట్టం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనలో అసాధారణ మార్పులు కనిపిస్తే ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, వేధింపులు లేదా హింసకు గురవుతున్నట్లు అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.ప్రతి విద్యార్థి భద్రత,సంక్షేమంపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి విద్యాభ్యాసంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని అన్నారు. పిల్లలపై జరిగే వేధింపులు,బాల్య వివాహాలు, బాల కార్మికత్వాన్ని అరికట్టేందుకు సంబంధిత అధికారులు చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, ప్రతి చిన్నారికి సురక్షితమైన, వివక్షలేని వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం నాల్సా -- పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం--2024,పోక్సో చట్టం,బాలల హక్కులు,బాల్య వివాహాల నివారణ,బాల కార్మిక నిర్మూలన, పిల్లల రక్షణపై అవగాహన కల్పించే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ సెషన్స్ న్యాయమూర్తి వి.శ్రీనివాస్,జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎ.నాగరాజు,జిల్లా విద్యా శాఖ అధికారి విజయ లక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సునంద, సీడీపీఓ ఆకాశ దీప్తి,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు



## స్నేహం ఒక సంపద

స్నేహానికి ఎల్లలు లేవు
స్నేహానికి పరిమితులు లేవు
స్నేహం ఒక మహా ప్రవాహం
మధుర జ్ఞాపకాలు స్నేహితులు!!
స్నేహం త్యాగాన్ని కోరుతుంది
ఆప్యాయత ప్రేమను కురిపిస్తుంది
స్నేహం సంతృప్తిని కలిగిస్తుంది
అభివృద్ధిని చేకూరుస్తుంది!!
సన్మార్గంలో పయనింపజేస్తుంది
స్నేహమేరా జీవితం
స్నేహమేరా శాశ్వతం
స్నేహానికన్న మిన్న ఈ లోకాన లేదు!!
స్నేహితులు దినోత్సవం సందర్భంగా..

రచన
దేవులపల్లి రమేశ్,
కవి, రచయిత
సిద్దిపేట, నంగునూర్
9963701294




## డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి

**జిల్లా యువజన అధికారి వి. కోట నాయక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని జిల్లా యువజన అధికారి వి. కోట నాయక్ పిలుపునిచ్చారు.భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు ఙ క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, 'నశా ముక్త్ భారత్ అభియాన్ -- మేరా యువ భారత్' సంయుక్త నిర్వహణలో శనివారం గద్వాల్ లోని ఎంఏఎల్ డి డిగ్రీ ఙ పీజీ కళాశాలలో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి మాట్లాడుతూ --- 'నశా ముక్త్ భారత్ అభియాన్' ముఖ్య లక్ష్యం మత్తు రహిత సమాజాన్ని నిర్మించడమేనని తెలిపారు. దేశ భవిష్యత్తు అయిన యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మత్తు వ్యసనాలు వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు.అనంతరం విద్యార్థులచే 'నశా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ చేయించారు. యువతలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు నుక్కడ్ నాటకం, పాటలు, వ్యాసరచన మరియు పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఎస్ఐ శివకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ కలందర్ పాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ భాస్కర్, అధ్యాపకులు సురేందర్ రెడ్డి, డా. కర్ణాకర్, వివిధ కళాశాలల అధ్యాపకులు, యువత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





## నానో యూరియా అమ్మకాలు పెరగాలి

**రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలి:**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

యూరియాను అధిక మొత్తంలో వినియోగిస్తుండడంతో వ్యవసాయ క్షేత్రాలు సారవంతతను కోల్పోతున్నాయని, అన్నదాతలు నానో యూరియా ఎక్కువగా వినియోగించేలా వాటి అమ్మకాలను పెంచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని వెంకటరమణ పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్,. సీడ్స్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల విత్తనాలు, ఎరువుల విక్రయాలు, వాటి ధరల గురించి దుకాణ యజమానిని అడిగారు. వివిధ స్టాక్ రిజిస్టర్ లను, పలు కూరగాయల విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. యూరియాను ఆన్లైన్లో బుక్ చేస్తుండడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. రైతులు ఎక్కువగా నానో ఏరియా వినియోగించేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ నినో నేపథ్యంలో వర్షాలు తక్కువగా కురుస్తుండడంతో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలైన కందులు, కూరగాయలు, తదితర సాగుపై ఎక్కువగా దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. పెస్టిసైడ్స్, సీడ్స్, ఫర్టిలైజర్స్ దుకాణాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఏడిఏ సుబ్బారెడ్డి, ఏవో సురేష్ గౌడ్, ఏఈఓ నరేష్, తదితరులున్నారు.





## జాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో గోరింటాకు వేడుకలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1 ( ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలం జాంపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేతులకు గోరింటాకు పెట్టుకుని విద్యార్థినిలు, ప్రధానోపాధ్యాయురాలు సందడి చేశారు.ఈ మేరకు ఆషాఢ మాసంలో గోరింటాకు విశిష్టతను విద్యార్థులకు హెచ్ఎం రేవతి వివరించారు. ఆషాఢమాసంలో ప్రతీ ఏటా ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.




## ఘనంగా పౌర్ణిమ జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్**

**కూకట్‌పల్లి, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం)**

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ కార్యాలయంలో ఆప్యాయత, ఆత్మీయతల నడుమ కార్యాలయ సిబ్బందిలోని పౌర్ణిమ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ పౌర్ణిమకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె జీవితంలో సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, విజయాలు నిత్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి మనిషి జీవితంలో జన్మదినం ఒక ప్రత్యేకమైన సందర్భమని, అది కొత్త ఆశయాలకు, కొత్త లక్ష్యాలకు నాంది పలికే రోజు అని బండి రమేష్ పేర్కొన్నారు. పౌర్ణిమ జీవితంలో కోరుకున్న ప్రతి లక్ష్యం నెరవేరాలని, వృత్తిపరంగా, వ్యక్తిగతంగా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆమె చిరునవ్వుతో, సేవాభావంతో, విజయాలతో కూడిన సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.అనంతరం పౌర్ణిమ మర్యాదపూర్వకంగా బండి రమేష్ ను కలిసి వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బండి రమేష్ ఆమెకు మిఠాయిలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. కార్యాలయంలోని సిబ్బంది, నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలు స్నేహపూర్వక, ఆప్యాయ వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ కొనసాగాయి. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ పౌర్ణిమకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు చేకూరాలని, ఆమె ఆయురారోగ్యాలతో, ఆనందంతో నిండిన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలు కుటుంబసభ్యుల తరహా ఆత్మీయతను ప్రతిబింబించాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, రామారావు, రమణ, కామినేని వాసు, అస్లాం, శ్రీనివాస్, మహేష్, నాగార్జున, అరుణ్, బాలరాజు, సృజన్, పర్వేట్, సంధ్య, రమాదేవి, జ్యోతి తదితరులు పాల్గొని పౌర్ణిమకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల అనంతరం అందరూ కలిసి మిఠాయిలు పంచుకొని ఆనందాన్ని పంచుకున్నారు. పౌర్ణిమ జన్మదిన వేడుకలు కార్యాలయంలో ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలిచి, పాల్గొన్న వారందరిలో ఆనందాన్ని నింపాయి.

# జూరాల ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

**ఇన్ ఫ్లో 1,70,000 క్యూసెక్కులు**

**అవుట్ ఫ్లో 1,79,023 క్యూసెక్కులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1(ప్రభాత ఉదయం)**



మహారాష్ట్ర, కర్ణాటక లో కురుస్తున్న భారీ వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో కర్ణాటక జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టులోకి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. శనివారం సాయంత్రానికి ప్రాజెక్టుకు 1,70,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టుకు వస్తున్న వరదను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టు 29 క్రస్టు గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా 1,46,018 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా మరో 33,966 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.415 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తికి 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతోపాటు నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్-1కు 1,300, కోయిల్‌సాగర్ లిఫ్ట్‌కు 630 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాలకు మొత్తం ఇన్‌ఫ్లో శనివారం సాయత్రం 6గంటలకు జూరాల ఇన్ ఫ్లో 1,70,000 క్యూసెక్కులు, కాగా అవుట్ ఫ్లో 1,79,023 క్యూసెక్కులుగా నమోదైంది.

# జడ్చర్ల పట్టణ కేంద్రంలో ఘనంగా శ్రీరామ పాదుకల యాత్ర





**జడ్చర్ల, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

జడ్చర్ల పట్టణ కేంద్రంలో శ్రీరామ పాదుకల యాత్ర భక్తిశ్రద్ధలతో జరిగింది. హిందూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పురవీధులను హైందవుల ఐక్యతను చాటారు





# రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసిన కార్మిక నాయకుడు కర్కనాగరాజు

**కూకట్ పల్లి, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం)**

మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కూకట్‌పల్లి నియోజకవర్గం ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షులు కర్కనాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్.యస్.యు.ఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పొన్నం ప్రభాకర్ తో గతంలో విద్యార్ధి నాయకుడిగా వారితో కలిసి పనిచేసిన రోజులను నెమరేసుకున్నారు. కార్మిక నాయకుడిగా కార్మికలకు మరింత సేవ చేయాలని దివంగత నేత పి.జే.ఆర్ ని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్ళాలని కర్కనాగరాజు కు సూచించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించటం లో కాంగ్రెస్ ప్రభుత్వం ముందువుంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ నాయకులు ఎర్ర కృష్ణ కుమార్, మొహ్సిన్ ఖురేషీ తదితరులు పాల్గొన్నారు.


# నిబంధనలకు మించి ఇంకుడు గుంతల నిర్మాణం

## వర్షపు నీటి సంరక్షణలో ఆదర్శంగా భవన యజమానులు

**హైదరాబాద్, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం)**

ఓసీ సర్టిఫికేట్ కోసమే కాకుండా భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాలుగు రీచార్జ్ పిట్ల ఏర్పాటుహైదరాబాద్‌లోని ప్రకాశ్‌నగర్ వార్డు, మోతీలాల్ నెహ్రూ నగర్, ఇంటి నంబర్ 1-11-252/50/ాలో శ్రీ వినోద్ శ్రీ భాష్యం భవన యజమానులు సమర్థవంతమైన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి వర్షపు నీటి సంరక్షణలో అందరికీ ఆదర్శంగా నిలిచారు. భవన యజమానులు కేవలం ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓసీ) పొందేందుకు అవసరమైన నిబంధనలను పాటించడానికే పరిమితం కాకుండా, భవిష్యత్తులో పెరిగే నీటి అవసరాలు, భూగర్భ జలాల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించారు. నిబంధనల ప్రకారం అవసరమైన వాటికంటే అదనంగా ఇంకుడు గుంతలను నిర్మించి, వర్షపు నీటిని సమర్థవంతంగా భూగర్భంలోకి ఇంకించే శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రాంగణంలో 6 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పు, 6 అడుగుల లోతుతో మొత్తం నాలుగు రీచార్జ్ పిట్లు నిర్మించారు. భవనం పైకప్పుపై పడే వర్షపు నీటిని ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా ఈ ఇంకుడు గుంతల్లోకి మళ్లిస్తున్నారు. ప్రస్తుతం రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థ పూర్తిస్థాయిలో, సమర్థవంతంగా పనిచేస్తోంది. ఈ భవన ప్రాంగణంలో బోర్‌వెల్ ఉంది. క్రమబద్ధంగా వర్షపు నీటిని భూగర్భంలోకి మళ్లించడం వల్ల వేసవి కాలంలో కూడా బోర్‌వెల్ పనిచేస్తుండటం రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వల్ల కలిగే ప్రయోజనాలకు నిదర్శనంగా నిలుస్తోంది. నిబంధనలను కేవలం అధికారిక ప్రక్రియగా చూడకుండా, రేపటి నీటి భద్రత కోసం స్వచ్ఛందంగా అదనపు ఇంకుడు గుంతలను నిర్మించిన భవన యజమానుల చర్య అభినందనీయమని జలమండలి పేర్కొంది. ఇలాంటి బాధ్యతాయుతమైన చర్యలను ఇతర గృహ, అపార్ట్‌మెంట్, వాణిజ్య భవన యజమానులు కూడా అనుసరించాలని సూచించింది. ప్రతి ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని వృథాగా కాలువల్లోకి వెళ్లనీయకుండా ఇంకుడు గుంతలు, రీచార్జ్ పిట్లు లేదా పనిచేయని బోర్‌వెల్‌లలోకి మళ్లించాలని జలమండలి ప్రజలకు విజ్ఞప్తి చేసింది. దీనివల్ల భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు బోర్‌వెల్‌ల మనుగడ మెరుగుపడి, విలువైన నీటి వనరులు సంరక్షించబడతాయి. ముఖ్యంగా





వేసవి కాలంలో ప్రభుత్వ తాగునీటి సరఫరా, ట్యాంకర్లపై పడే ఒత్తిడిని తగ్గించవచ్చని తెలిపింది.

**జలమండలి ఎండీ అశోక్ రెడ్డి:**

ఓసీ సర్టిఫికేట్ కోసం నిబంధనలు పాటించడం మాత్రమే కాకుండా, భవిష్యత్తు తరాల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి. నేటి వర్షపు నీటి సంరక్షణే రేపటి నీటి భద్రతకు పునాది అని పిలుపునిచ్చారు.

**ప్రత్యేకంగా అభినందించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**

నగరంలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛందంగా రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు, ఇంకుడు గుంతలు, ఇంజెక్షన్ వెల్‌లు ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాల పెంపునకు కృషి చేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు, గృహ యజమానులు, కాలనీ ప్రతినిధులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

గాంధీనగర్‌లోని ఉదయ బ్లాసమ్ అపార్ట్‌మెంట్ నివాసితులు తాగునీటి సమస్యపై జలమండలిని సంప్రదించి, సాంకేతిక బృందం సూచనల మేరకు 2026 మే చివరి వారంలో రెండు రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఇంజెక్షన్ వెల్‌లతో ఏర్పాటు చేశారు. స్వల్ప వర్షాలకే కొద్ది రోజుల్లో బోర్‌వెల్ నీటి దిగుబడి గణనీయంగా పెరగడం అభినందనీయమని ఎండీ పేర్కొన్నారు. అలాగే వెంకటగిరి-- యూసుఫ్‌గూడకు చెందిన కావల్ కుమార్, రాక్‌టౌన్ కాలనీలోని ఏస్ రత్న పెర్ల్ అపార్ట్‌మెంట్‌కు చెందిన రవీందర్ రెడ్డి, మణికొండలోని అనుహార్ పర్పుల్ ట్యూన్స్ అపార్ట్‌మెంట్‌కు చెందిన కరుణాకర్ రెడ్డి, బాచుపల్లిలోని సీఎస్ఆర్ క్లాసిక్ అపార్ట్‌మెంట్‌కు చెందిన పవన్ కుమార్, కొండాపూర్‌లోని బొమ్మరిల్లు రెసిడెన్సీకి చెందిన రంగారావు, నాగోల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీకి చెందిన లవకుశ రెడ్డి చేపట్టిన చర్యలను ప్రశంసించారు. సనత్‌నగర్ చెక్ కాలనీలోని ఆకృతి రెసిడెన్సీకి చెందిన శ్రీనివాస్, మోతీనగర్ సమీపంలోని గాయత్రీనగర్‌కు చెందిన నాగేశ్వరరావు, హయత్‌నగర్‌కు చెందిన పూర్ణచందర్ రావు, శ్రీనగర్ కాలనీలోని పార్కులో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటుకు సహకరించిన చిన్నారావును కూడ అభినందించారు. వీరు నిబంధనల అమలుకే పరిమితం కాకుండా, భవిష్యత్ నీటి భద్రతను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారని ఎండీ అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విజయగాథలు భూగర్భ జలాల పెంపు, బోర్‌వెల్ల పునరుద్ధరణ, వేసవిలో నీటి లభ్యత మెరుగుదల, ట్యాంకర్లపై ఆధారాన్ని తగ్గించడంలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని నిరూపిస్తున్నాయని తెలిపారు.

# క్షమాపణలు కాదు... కేసుల ఎత్తివేతపై మాట్లాడండి

## ప్రధాని మోడీ క్షమాపణలపై అభిజిత్ దీప్కే ప్రశ్నలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్1 (ప్రభాత ఉదయం)**



విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రీల్‌లో మాత్రమే క్షమిస్తారా? లేక విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉ పసంహరించుకుంటారా?' అంటూ ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో, కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు. తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. వీడియోపై స్పందించిన అభిజీత్ దిప్కే, 'క్షమించామని చెప్పడం సరిపోదు. విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?' అని ప్రశ్నించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఒక కెమెరామెన్‌పై అనుచిత పదజాలం ఉపయోగించిన వీడియోను ప్రస్తావిస్తూ, 'ఈ దేశంలో రెండు రకాల చట్టాలా? యువతకు ఒకటి, అధికార పార్టీకి మరొకటా?' అని విమర్శించారు. కాగా, ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలతో నోయిడాకు చెందిన ఓ బాలికపై కేసు నమోదైంది (ఏజీనిబిజీస ఓజీనిబిజీస ÷ఔసనీబిబబి). తాజాగా ఆమె వీడియో విడుదల చేసి దేశ ప్రజలకు, ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పింది. తాను చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. కాగా, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# బోయిన్‌పల్లి ఉచిత యోగా కేంద్రంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

## గురువులకు ఘన సన్మానం ... వేలాది మందికి ఉచిత యోగా శిక్షణ అందిస్తున్న కేంద్రం సేవలు ప్రశంసనీయం

**కూకట్ పల్లి, ఆగస్టు 1(ప్రభాత ఉదయం)**



గురు--శిష్య పరంపర భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైనదని మరోసారి చాటిచెప్పేలా బోయిన్‌పల్లి ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులోని ఉచిత యోగా కేంద్రంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధల మధ్య నిర్వహించబడ్డాయి. యోగా సాధకులు, శిష్యులు, గురువులు పెద్ద సంఖ్యలో పాల్గొని గురువులకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా 2008లో యోగా కేంద్రాన్ని స్థాపించిన ముఖ్య గురువు రవి గురూజీతో పాటు పవన్ గురూజీ, రంజన్ గురూజీ, నరేందర్ గురూజీ, వినోద్ గురూజీ, శంకర్ గురూజీ, భాగ్యలక్ష్మి గురూజీ, రాయుడు గురూజీ మరియు ఇతర యోగా గురువులను ఒకే వేదికపై శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం గురువుల ఆశీర్వాదాలను శిష్యులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు.

**-- 18 ఏళ్లుగా నిరంతర యోగా సేవలు.............**

2008లో ప్రారంభమైన ఈ ఉచిత యోగా కేంద్రం గత 18 సంవత్సరాలుగా ఎలాంటి రుసుము లేకుండా వేలాది మందికి యోగా శిక్షణ అందిస్తూ ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందిస్తోంది. వయస్సుతో సంబంధం లేకుండా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ యోగా సాధనను అందుబాటులోకి తీసుకువచ్చి సమాజానికి విశేష సేవలు అందిస్తోంది. 200 మందికి పైగా యోగా గురువులుగా తీర్చిదిద్దిన కేంద్రం ఈ యోగా కేంద్రం సాధించిన అత్యంత విశిష్ట విజయాల్లో ఒకటి శిక్షణ పొందిన వారిలో 200 మందికి పైగా యోగా గురువులుగా ఎదగడం. వారు ప్రస్తుతం తమ తమ ప్రాంతాల్లో సొంత యోగా కేంద్రాలను స్థాపించి ప్రజలకు ఉచితంగా, సేవాభావంతో యోగా శిక్షణ అందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. ఈ విధంగా బోయిన్‌పల్లి యోగా కేంద్రం ఒక శిక్షణా కేంద్రంగా మాత్రమే కాకుండా, కొత్త యోగా గురువులను తయారు చేసే స్ఫూర్తిదాయక సంస్థగా గుర్తింపు పొందింది.

**-- గురువుల సేవలను కొనియాడిన శిష్యులు........**

కార్యక్రమంలో పాల్గొన్న యోగా సాధకులు, శిష్యులు మాట్లాడుతూ గురువు చూపిన మార్గమే జీవితాన్ని ఆరోగ్యవంతంగా, క్రమశిక్షణతో ముందుకు నడిపిస్తుందని పేర్కొన్నారు. తమ జీవితాల్లో యోగా ద్వారా వచ్చిన శారీరక, మానసిక మార్పులను గుర్తుచేసుకుంటూ గురువుల సేవలను హృదయపూర్వకంగా కొనియాడారు.

**యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం**

గురువులు మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది సంపూర్ణ జీవన విధానమని వివరించారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందించే గొప్ప సాధన యోగా అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు యోగా సాధన చేస్తే సమాజం మరింత ఆరోగ్యవంతంగా మారుతుందని తెలిపారు.

**-- గురుపౌర్ణమి శుభాకాంక్షలు.......**

వేడుకల ముగింపులో గురువుల ఆశీస్సులతో సమాజంలో యోగా, ఆరోగ్య చైతన్యాన్ని మరింత విస్తరించాలని సంకల్పించారు. గురు--శిష్య బంధం చిరస్థాయిగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ అందరికీ గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో ముఖ్యాంశాలు, గురువులకు ఘన సన్మానం గురుపూజ, ఆశీర్వచనాలు, యోగా సాధకుల అనుభవాల పంచిక గురు--శిష్య పరంపర గొప్పతనంపై ప్రసంగాలు, యోగా ద్వారా ఆరోగ్య చైతన్య విస్తరణకు పిలుపు. బోయిన్‌పల్లి ఉ చిత యోగా కేంద్రం గత 18 సంవత్సరాలుగా వేలాది మందికి ఉచిత యోగా శిక్షణ అందిస్తూ, వందలాది మంది యోగా గురువులను తీర్చిదిద్ది సమాజంలో ఆరోగ్య విప్లవానికి మార్గదర్శకంగా నిలుస్తుండటం విశేషం.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608